క్లుప్తంగా

ఎస్సీ సెల్ కార్యదర్శికి పెద్దిరెడ్డి అభినందన



గురునాథంను అభినందిస్తున్న పెద్దిరెడ్డి

బుచ్చినాయుడుకండ్రిగ: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శిగా నియమితులైన ఉగ్గుమూడి గురునాథంను మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి శాలువ కప్పి, పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు. ఉగ్గుమూడి గురునాథం సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్‌తో కలసి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని తిరుపతిలోని ఆయన స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలిశారు. దీంతో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఉగ్గుమూడి గురునాథంను అభినందించి, పార్టీ అభ్యున్నతి కోసం కష్టపడి పనిచేయాలని సూచించి, పలు సలహాలు, సూచనలు ఇచ్చారు.

అన్నదానానికి బియ్యం వితరణ



అర్చకుల ఆశీర్వాదం అందుకుంటున్న కుర్రకాల్వ వాసు

రేణిగుంట(శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంట మండలం గుత్తివారిపల్లెలో శ్రీ కోదండ రామాలయంలో నిర్వహించిన నవమి వేడుకలలో అన్నదాన కార్యక్రమానికి కరకంబాడి శ్రీ కట్ట పుట్టాలమ్మ ఆలయ వంశపారపర్య ధర్మకర్త కుర్రకాల్వ వాసు బియ్యం వితరణగా అందజేశారు. ఆయనకు ఆలయ పెద్దలు ప్రత్యేక దర్శనం చేయించి ఘనంగా సత్కరించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ప్రతి ఏటాలాగే ఈసారి కూడా మసూర బియ్యం అందజేశారు.

జేఎల్ఎం గ్రేడ్-2 సమస్యలు పరిష్కరించాలి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న అసోసియేషన్ నాయకులు

శ్రీకాళహస్తి: జేఎల్ఎం గ్రేడ్-2 సమస్యలను పరిష్కరించాలని సోమవారం గ్రామ, వార్డు, సచివాలయ ఎనర్జీ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు కోరారు. సీపీఐ ఏరియా కార్యదర్శి జనమాల గురవయ్య ఆధ్వర్యంలో సోమవారం మున్సిపల్ కమిషనర్ గిరికుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. గురవయ్య మాట్లాడుతూ, సచివాలయ సర్వేల నుంచి జేఎల్ఎం గ్రేడ్-2లకు మినహాయింపు ఇవ్వాలన్నారు. దీనికి కమిషనర్ సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో ముని హరికృష్ణ, పవన్ కల్యాణ్, తమీమ్, చాంద్‌బాషా, సుధీర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

రేణిగుంట ఐపీఎఫ్ సందీప్ కుమార్ బదిలీ



సందీప్‌కుమార్‌ను సన్మానిస్తున్న తిరుపతి ఐపీఎఫ్ మధుసూదన్‌రావు

రేణిగుంట: రేణిగుంట ఆర్‌పీఎఫ్‌లో ఐపీఎఫ్‌గా పనిచేస్తున్న ఎం సందీప్ కుమార్ తిరుపతికి బదిలీ అయ్యారు. సోమవారం పట్టణంలోని రైల్వే కల్యాణ మండపంలో ఆయనకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఆర్‌పీఎఫ్ అసిస్టెంట్ కమిషనర్ కె.రాజగోపాల్‌రెడ్డి, తిరుపతి ఐపీఎఫ్ మధుసూదన్ రావు, రేణిగుంట అర్బన్ ఎస్ఐ అరుణ్ కుమార్ రెడ్డి సందీప్ కుమార్‌ను పూలమాలలు, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో రైల్వే ఆస్పత్రి వైద్యాధికారులు రిహానా, చంద్రశేఖర్, రేణిగుంట రైల్వే స్టేషన్ మేనేజర్ శేషగిరినాథరెడ్డి, సర్పంచ్ నగేశం తదితరులు పాల్గొన్నారు.

సర్వర్ సమస్యతో బ్యాంకు సేవలు స్తంభన



ఏర్పేడు యూనియన్ బ్యాంకు ముందు నిరీక్షిస్తున్న ఖాతాదారులు

ఏర్పేడు(రేణిగుంట): ఏర్పేడు యూనియన్ బ్యాంకు సేవలు సోమవారం కొన్ని గంటల పాటు సర్వర్ సమస్యతో స్తంభించాయి. ఉదయం 10గంటల కల్లా బ్యాంకు వద్దకు వచ్చిన సిబ్బంది నెట్‌వర్క్ సమస్య తలెత్తిందని గుర్తించి ఆ సమస్యను తెలియజేస్తూ బ్యాంకు గేట్లకు బోర్డు పెట్టారు. వివిధ లావాదేవీల నిమిత్తం బ్యాంకుకు వచ్చిన ఖాతాదారులు గంటల తరబడి ఎండలోనే నిరీక్షించారు. తిరుపతి నుంచి నిపుణులు వచ్చి సర్వర్ సమస్యను పరిష్కరించడంతో బ్యాంకు లావాదేవీలు మధ్యాహ్నం 12గంటల నుంచి యథావిధిగా కొనసాగాయి.

అధికారులు లేరు..!

సత్యవేడు, శ్రీకాళహస్తి నియోజకవర్గాల పరిధిలోని కొన్ని ఆర్‌అండ్‌బీ రోడ్ల పర్యవేక్షణ శ్రీకాళహస్తిలోని రోడ్లు భవనాల శాఖ సబ్ డివిజన్ పరిధిలోకి వస్తుంది. అయితే ఈ కార్యాలయ పరిధిలో అధికారుల కొరత వేధిస్తోంది. ప్రధానంగా రోడ్ల పర్యవేక్షణ చేయాల్సిన జేఈ స్థాయి ఇంజినీరింగ్ అధికారులు పూర్తిస్థాయిలో లేరు. దీంతో రెండు నియోజకవర్గాల పరిధిలో 423 కి.మీ రోడ్ల పర్యవేక్షణ ప్రశ్నార్థకంగా మారింది. దీనిపై ఆ శాఖ జిల్లా ఉన్నత యంత్రాంగం ఏ మాత్రం పట్టించుకోకపోవడం సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

శ్రీకాళహస్తిలోని ఆర్‌అండ్‌బీ సబ్ డివిజన్ కార్యాలయం



- శ్రీకాళహస్తి ఆర్‌అండ్‌బీ సబ్ డివిజన్‌కు అధికారుల కొరత
- నాలుగు సెక్షన్లకు ఒకరే జేఈ
- వర్క్ ఇన్‌స్పెక్టర్లు అసలే లేరు
- ప్రశ్నార్థకంగా 423 కిలోమీటర్ల రోడ్ల పర్యవేక్షణ



శ్రీకాళహస్తి సబ్ డివిజన్ పరిధిలో అధ్వానంగా ఉన్న వరదయ్యపాళెం-పెద్ద పాండూరు రోడ్డు

శ్రీకాళహస్తి ఆర్ అండ్ బి సబ్ డివిజన్ పరిధిలో రోడ్ల వివరాలు:

సెక్షన్ పేరు	రోడ్ల విస్తీర్ణం (కి.మీలలో)
బీఎస్‌కండ్రిగ	89
తొట్టంబేడు	80
శ్రీకాళహస్తి	170
కేవీబీపురం	84

వరదయ్యపాళెం: శ్రీకాళహస్తి ఆర్‌అండ్‌బీ సబ్ డివిజన్ పరిధిలో బుచ్చినాయుడుకండ్రిగ, తొట్టంబేడు, శ్రీకాళహస్తి, కేవీబీపురం సెక్షన్లు ఉన్నాయి. వీటి పరిధిలో 423 కి.మీ మేరకు ఆర్‌అండ్‌బీ రోడ్లు ఉన్నాయి. అయితే వీటి పర్యవేక్షణ కోసం ఒక్కో సెక్షన్‌కు జేఈ స్థాయి ఇంజినీరింగ్ అధికారి, ఆయనకు సహాయకులుగా వర్క్ ఇన్‌స్పెక్టర్, 10 నుండి 15 మంది గ్యాంగ్‌మెన్ గతంలో ఉండేవారు. అయితే కాంట్రాక్టర్ల వ్యవస్థ పూర్తిస్థాయిలోకి రావడంతో గ్యాంగ్‌మెన్ కనుమరుగయ్యారు. ఆ గ్యాంగ్‌మెన్‌లు గతంలో ఉన్నవారు తప్ప నూతనంగా భర్తీ చేసుకోకపోగా ఆ వ్యవస్థ కనుమరుగైంది. అయితే ఉండాల్సిన కీలక ఇంజినీరింగ్ అధికారులు కూడా లేకపోవడంతో రోడ్ల పర్యవేక్షణ ప్రశ్నార్థకంగా మారింది. రోజురోజుకు సిబ్బంది కొరత జఠిలమవుతోంది. దీని కారణంగా సబ్ డివిజన్ పరిధిలో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోవడంతో పాటు సకాలంలో స్పందించలేని పరిస్థితి. ప్రధానంగా నూతన పనుల మంజూరు కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయడంలో, మంజూరై నిర్మాణ దశలో ఉన్న పనుల పర్యవేక్షణలో దృష్టి సారించలేకపోతున్నారు. దీని కారణంగా చేసిన పనులకు సంబంధించి సకాలంలో బిల్లుల నివేదనలో జాప్యం జరుగుతున్నట్లు సమాచారం. ఇలా అనేక సమస్యలు సిబ్బంది కొరత కారణంగా వెంటాడుతున్నాయి.

సబ్ డివిజన్‌కు అతనొక్కడే..

ఆర్‌అండ్‌బీ సబ్ డివిజన్ పరిధిలో తొట్టంబేడు, శ్రీకాళహస్తి, కేవీబీపురం సెక్షన్లకు జేఈలు లేరు. గత కొంత కాలంగా ఈ పోస్టుల భర్తీకి నోచుకోలేదు. బీఎస్‌కండ్రిగ సెక్షన్‌కు ఉన్న జేఈ మాత్రమే సబ్ డివిజన్ మొత్తం ఇన్‌చార్జ్ బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. వారికి సహాయంగా సబ్ డివిజన్ డీఈ ఉన్నారు. అయితే సబ్ డివిజన్ పరిధిలో ఏ పని జరిగినా బిల్లులకు సంబంధించి ఎం-బుక్‌ల రికార్డింగ్ ఆ ఒక్క జేఈ మాత్రమే చేపట్టాల్సి ఉంది. అంతేకాక 4 సెక్షన్‌లకు సంబంధించి ఉండాల్సిన నలుగురు వర్క్ ఇన్‌స్పెక్టర్లు కొన్నేళ్లుగా భర్తీ కాకపోవడం గమనార్హం.

కొరవడిన పర్యవేక్షణ

శ్రీకాళహస్తి ఆర్‌అండ్‌బీ సబ్ డివిజన్ పరిధిలోని రోడ్లను పర్యవేక్షించాల్సిన అధికారులు పత్తా లేరు. సబ్ డివిజన్ పరిధిలో ఒక డీఈ, ఒక జేఈ మాత్రమే ఇంజినీరింగ్ విభాగంలో ఉన్నారు. ఎక్కడా ఏ రోడ్డు ఏ పరిస్థితిలో ఉంది అన్న క్షేత్ర స్థాయి వివరాల పర్యవేక్షణ సిబ్బంది కొరత కారణంగా ఇబ్బంది అవుతోంది. ఇంతటి విస్తీర్ణం కలిగిన రోడ్ల అభివృద్ధికి సంబంధించి నిధుల మంజూరు కోసం ప్రణాళికలు చేయడంలో జాప్యం జరుగుతోంది. అంతేకాక మరమ్మతులకు గురైన రోడ్ల గుర్తింపులో జాప్యం జరుగుతోంది. ప్రధానంగా వర్షాకాలంలో పలుచోట్ల రోడ్లు కొట్టుకుపోవడం, ఇతరత్రా పరిస్థితులు ఏర్పడినప్పుడు శాఖాపరంగా సకాలంలో స్పందించలేని పరిస్థితి నెలకొంది. ప్రధానంగా జేఈ పోస్టులు, వర్క్ ఇన్‌స్పెక్టర్ల నియామకం జరిగితే సబ్ డివిజన్ పరిధిలో పాలనా పరమైన పనులు గాడిన పడే పరిస్థితి ఉంది.

ప్రభుత్వానికి నివేదించాం



సబ్ డివిజన్ పరిధిలో ఖాళీ పోస్టులకు సంబంధించి శాఖాపరంగా ఉన్నతాధికారులకు నివేదించాం. పోస్టుల భర్తీకి సంబంధించి జిల్లా ఉన్నతాధికారుల నిర్ణయంపై ఆధారపడి ఉంది. ఉన్నవారితో ఎక్కడా ఇబ్బంది లేకుండా పనులు చేసుకుంటున్నాం. పూర్తిస్థాయిలో భర్తీ అయితే ఇంకొంచెం మెరుగ్గా శాఖాపరమైన సమస్యలపై స్పందించే పరిస్థితి ఏర్పడుతుంది.

– రాంబాబు, డీఈ, శ్రీకాళహస్తి సబ్ డివిజన్

ఊంజల్ సేవలో పద్మావతీ అమ్మవారు

నారాయణవనం: టీటీడీ అనుబంధ పద్మావతీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో పంగుణోత్తర ఉత్సవాల్లో మూడో రోజు సోమవారం సాయంత్రం పద్మావతి అమ్మవారు ఊంజల్‌సేవలో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఉదయం సుప్రభాతసేవతో నిత్యపూజా కైంకర్యాలను పూర్తి చేసి అర్చకులు నైవేద్యం సమర్పించారు. పద్మావతీ అమ్మవారికి అభిషేకం చేశారు. సాయంత్రం నిత్య పూజలు పూర్తయిన తర్వాత అమ్మవారిని పట్టుపీతాంబరాలు, స్వర్ణాభరణాలను, సుగంధపుష్ప మాలికలతో సుందరంగా అలంకరించి తిరుచ్చి వాహనంపై అధిష్టింపచేశారు. ఆలయ ప్రాకారంలో ఊరేగిన అమ్మవారు ఊంజల్ మండపంలో ఊయలపై కొలువుదీరారు. వేద మంత్రోచ్చారణ, మంగళవాయిద్యాల నడుమ అమ్మవారి ఉయ్యాల సేవ కనుల పండువగా కొనసాగింది. అమ్మవారిని దర్శించున్న భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయ అధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్, ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధరభట్టాచార్యులు ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



ఊంజల్ సేవలో అమ్మవారు

శాస్త్రోక్తంగా పెద్దకొట్టాయి ఉత్సవం



కోటమండపంలో పూజలు చేస్తున్న వేద పండితులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం శాస్త్రోక్తంగా పెద్దకొట్టాయి ఉత్సవం నిర్వహించారు. ఆలయ అలంకార మండపంలో స్వామి అమ్మవార్లకు పలు రకాల అభిషేక పూజలు అనంతరం కోట మండపం వద్ద మూడు ప్రదక్షిణలు చేసి, అక్కడ స్వామి అమ్మవార్లకు విశేష నైవేద్యం, మంత్రపుష్పం, దీపారాధన, హారతులు ఇచ్చారు. కార్యక్రమంలో ఈవో బాపిరెడ్డి, ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రపంచ ఆరోగ్య దినోత్సవంపై ర్యాలీ



బుచ్చినాయుడుకండ్రిగలో ర్యాలీ చేస్తున్న వైద్యసిబ్బంది



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

బుచ్చినాయుడుకండ్రిగ: ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం బుచ్చినాయుడుకండ్రిగలో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారిణి మాధవి మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యమన్నారు. ఆరోగ్యంగా ఉండాలంటే మద్యపానం, పొగతాగడం, మాంసాహారాన్ని మానుకోవాలని చెప్పారు. ఉప్పు వాడకాన్ని తగ్గించాలని, అధిక బరువు ప్రాణానికి ముప్పని తెలిపారు. అధిక రక్తపోటు, మధుమేహం రోగాలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్యులు విద్యాసాగర్, సీహెచ్‌ఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): చైల్డ్ ఫండ్ రాస్, ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో రేణిగుంట మండలం కరకంబాడి ఇందిరానగర్‌లోని రాస్ కార్యాలయంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. జనరల్ మెడిసిన్ డాక్టర్ స్రవంతి, చిన్నపిల్లల వైద్యనిపుణులు అనంత్, గైనకాలజిస్ట్ సృజన గ్రామస్తులకు ఆరోగ్యం, పోషక ఆహారం, పరిశుభ్రత, ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించారు. వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను ఉచితంగా అందించారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఈ శిబిరం ఏర్పాటు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. రాస్ ప్రాజెక్ట్ ఆఫీసర్ రమేష్ రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రపంచ ఆరోగ్య దినోత్సవ ర్యాలీ

సత్యవేడు: మండలంలోని దాసుకుప్పం పీహెచ్‌సీ పరిధిలో వైద్యులు, సిబ్బంది కలసి ప్రపంచ ఆరోగ్య దినోత్సవం ర్యాలీ సోమవారం నిర్వహించారు. డాక్టర్ అరుణ్ కుమార్ మాట్లాడుతూ వ్యక్తిగత, పరిసరాల శుభ్రత, తల్లీబిడ్డ ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ సుబ్రమణ్యం, సూపర్ వైజర్ వి.నాగజ్యోతి, మహాలక్ష్మి, ఎంఎల్‌పీహెచ్ భాను, ఎంఎల్‌హెచ్‌పీ భానుమతి, సీనియర్ అసిస్టెంట్ కవిత, గాయత్రి పాల్గొన్నారు.



దాసుకుప్పంలో ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య అధికారులు

అవగాహన ర్యాలీ

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా రేణిగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సోమవారం 'ఆరోగ్యకరమైన ఆరంభం-ఆశాజనక భవిష్యత్తు' అనే నినాదంతో అవగాహన ర్యాలీ నిర్వహించింది. పీహెచ్‌సీ డాక్టర్ జుబేర్ మాట్లాడుతూ, మాతా-శిశు మరణాలను నివారించాలన్నారు. గర్భిణులకు విశ్రాంతి, పోషకాహారం, గర్భధారణ ప్రమాద సంకేతాలు, గర్భస్థ కాలంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ ముని సుబ్బరామిరెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్లు కామరాజు, నాగరాజు, శివశంకర్, జైబూన్‌బీ, అనురాధ, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

యువకులపై కేసు నమోదు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంట పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి ఇరువురి మధ్య తలెత్తిన గొడవకు సంబంధించి సోమవారం కేసు నమోదు చేసినట్లు రేణిగుంట ఎస్ఐ అరుణ్‌కుమార్ రెడ్డి తెలిపారు. ఎస్ఐ కథనం... రేణిగుంట మండలం గురవరావరాజుపల్లె సమీపంలో ఆదివారం రాత్రి రేణిగుంట వేణుగోపాలపురానికి చెందిన కూటూరు దేవరాజు, అంబేడ్కర్ కాలనీకి చెందిన వెంకటేష్, చెంగారెడ్డిపల్లెకు చెందిన నితిన్ గొడవ పడ్డారు. దీనిపై విచారణ చేసిన పోలీసులు యువకులపై కేసు నమోదు చేశారు.

కనులపండువగా సీతారాముల కల్యాణం





కల్యాణోత్సవంలో సీతారాములవారు, గ్రామోత్సవంలో సీతారాముల ఉత్సవమూర్తులు

వరదయ్యపాళెం: మండలంలోని పెద్ద పాండూరులో వెలసిన శ్రీ సీతా సమేత శ్రీ కోదండరామస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. ఆదివారం రాత్రి 10 గంటలకు పైగా శ్రీ కోదండరామస్వామి కల్యాణోత్సవం వైభవంగా సాగింది. సమీప ప్రాంతాల నుంచి విశేష సంఖ్యలో భక్తులు పాల్గొని సీతారాముల కల్యాణాన్ని తిలకించారు. ఆలయ ప్రాంగణంలోని టీటీడీ భజన మందిరం వద్ద ఆరుబయట ఏర్పాటు చేసిన కల్యాణ వేదికపై వేదపండితులు మంత్రోచ్ఛరణల మధ్య ఆర్జిత కల్యాణోత్సవ దంపతులు ఆశీనులై తిలకిస్తుండగా సీతారాముల కల్యాణోత్సవం కనులపండువగా నిర్వహించారు. స్వామివారికి పట్టు వస్త్రాలు స్థానిక విశ్రాంత ఇంజనీర్ పరంధామ్ రెడ్డి కుటుంబ సభ్యులు అందజేశారు. అనంతరం రాత్రి స్వామి అమ్మవార్లకు పల్లకీ సేవ నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ అర్చకులు నిరంజనాచార్యులచే పూజలు చేశారు.

వైభవంగా శ్రీరాముని పట్టాభిషేకం

మండలంలోని పెద్ద పాండూరు గ్రామంలో వెలసిన శ్రీ సీతా సమేత కోదండరామస్వామి ఆలయంలో నవమి ఉత్సవాల్లో భాగంగా శ్రీరాముని పట్టాభిషేకం వైభవంగా నిర్వహించారు. స్వామి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. సాయంత్రం స్వామివారిని పుష్పపల్లకిలో పురవీధుల్లో ఊరేగించగా స్థానికులు కర్పూర హారతులతో మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు నిరంజనాచార్యులు పూజలు చేశారు. సమీప ప్రాంతాల నుంచి విశేష సంఖ్యలో భక్తులు పాల్గొని శ్రీరాముని పట్టాభిషేకం తిలకించారు. విశ్రాంత ఇంజినీర్ పరంధామ రెడ్డి దంపతులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

దాయాదుల మధ్య భూ వివాదం

శ్రీకాళహస్తి : మండలంలోని పిల్లమేడుకు చెందిన దాయాదుల నడుమ భూ వివాదం ముదిరి ఘర్షణకు దారితీసింది. సర్వేయర్, వీఆర్వో సమక్షంలో జరుగుతున్న భూ సర్వే వద్ద జరిగిన ఘర్షణలో వెంకటరమణ తీవ్ర గాయాలతో ప్రభుత్వాసుపత్రిలో చేరారు. బాధితుల కథనం.. పిల్లమేడు గ్రామానికి చెందిన వెంకటరమణయ్య, సుబ్రహ్మణ్యం, గురవయ్య, సుబ్బయ్య భూ సర్వే చేయాలని తహసీల్దార్ కార్యాలయాన్ని సంప్రదించారు. ఈ సందర్భంగా సోమవారం అక్కడికి చేరుకున్న అధికారుల సమక్షంలో వెంకటరమణయ్య, సుబ్బయ్యలను పిలిపించారు. అది అనాధీన భూమి అని ఎన్నో ఏళ్లుగా తన ఆధీనంలో ఉందని, అది వదిలేసి మిగిలింది కొలతలు వేయాలని అడగగా తనపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారని వెంకటరమణయ్య తెలిపారు.



గాయపడిన వెంకటరమణయ్య

పాఠ్య పుస్తకాల పంపిణీ

నాగలాపురం: మండల కేంద్రంలోని స్థానిక జూనియర్ కళాశాలలో రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు సోమవారం కళాశాల ప్రిన్సిపల్ శ్రీలత పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు ఉచితంగా పంపిణీ చేశారు. కళాశాల ప్రిన్సిపల్ శ్రీలత మాట్లాడుతూ కళాశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు ఒక్కొక్కరికి 12 పుస్తకాలు పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యాయులు దేవేంద్ర, జాకీర్, రెడ్డప్ప, వేలాయుధం సుజాత, హరినాథ్, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న కళాశాల ప్రిన్సిపల్ శ్రీలత

నోటీస్ బోర్డు

- 15న మెగా జాబ్‌మేళా

శ్రీకాళహస్తి: పట్టణంలోని శివం కల్యాణ మండపంలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సుమారు 15 కంపెనీల ప్రతినిధులు హాజరై తమకు కావాల్సిన అభ్యర్థులను ఎంపిక చేసుకునేందుకు ఇంటర్వ్యూలు చేస్తారని, నిరుద్యోగ యువత దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భూ సమస్యలను పరిష్కరించండి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దారు శ్రీదేవి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని భూసమస్యలను పరిష్కారానికి కృషి చేయాలని వీఆర్‌ఓలను నూతన తహసీల్దారు శ్రీదేవి ఆదేశించారు. ఆమె సోమవారం తహసీల్దారు కార్యాలయంలో వీఆర్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, సర్టిఫికెట్లను సకాలంలో అందజేయాలన్నారు. కార్యాలయం చుట్టూ పనులకోసం ప్రజలు తిరగకుండా చూడాలని, గ్రామాల్లో అందుబాటులో ఉండాలని తెలిపారు. భూముల సర్వేను పూర్తి చేయాలని చెప్పారు. పెండింగ్ భూముల సమస్యలుంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. తిమ్మభూపాలపురం, చల్లమాంబపురం గ్రామాల్లో జరుగుతున్న భూముల రీసర్వేను వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీటీ చంద్రబాబునాయుడు, ఆర్ఐ నల్లయ్య, సీనియర్ అసిస్టెంట్ నాగరాజురెడ్డి, సర్వేయర్ రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేత హఠాన్మరణం

నాగలాపురం: పిచ్చాటూరు మండలం ముడియూరు పంచాయతీకి చెందిన వైఎస్సార్‌సీపీ నేత గురవయ్య సోమవారం తెల్లవారు జామున ఆకస్మికంగా మృతి చెందారు. ఆదివారం రాత్రి భోజనం చేసి పడుకున్న వ్యక్తి సూర్యుడు ఉదయించే సరికి ప్రాణాలను కోల్పోవడం కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. సమాచారం అందుకున్న వైఎస్సార్‌సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ ముడియూరు గ్రామానికి చేరుకుని గురవయ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ గురవయ్య మరణం పార్టీకి తీరని లోటు అని అన్నారు. ఆయనతో పాటు మండల అధ్యక్షులు చలపతిరాజు, రాష్ట్ర కార్యదర్శి కె.వి.భాస్కర్ నాయుడు, ఎంపీటీసీ సభ్యుడు రమేష్ రాజు, నాయకులు సుబ్రమణ్యం రెడ్డి, చెంగల్‌రాయులు రెడ్డి, కిరణ్ కుమార్ నాయుడు, బాబు రెడ్డి, పాల్గొన్నారు.



గురవయ్య మృతదేహానికి నివాళులర్పిస్తున్న నూకతోటి రాజేష్

నివాళి..పరామర్శ



రహంతుల్లా సతీమణి మృతదేహానికి నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: పట్టణానికి చెందిన సీనియర్ పాత్రికేయులు రహంతుల్లా సతీమణి సోమవారం మృతి చెందారు. ఇది తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఆమె మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. రహంతుల్లాకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే, వైఎస్ఆర్‌సీపీ 13వ వార్డు ఇన్‌చార్జ్ వేలూరు రమేష్ తల్లి వేలూరు సరస్వతిని ఆయన పరామర్శించారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, నాయకులు పఠాన్ ఫరీద్, మహబూబ్‌బాషా, పగడాల రాజు, శరవణకుమార్, కంఠా ఉదయ్‌కుమార్, మున్నా రాయల్, సురేష్, రమేష్, గణేష్, అస్లాం, కుమార్ తదితరులు పాల్గొన్నారు.



చెంచురెడ్డిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

చెంచురెడ్డికి పరామర్శ

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే తాటిపర్తి చెంచురెడ్డిని సోమవారం మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి పరామర్శించారు. ఆయన ఆరోగ్యం ఎలా ఉందో అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలోఅంజూరు తారక శ్రీనివాసులు, నాయకులు సురేష్, పీఎం చంద్ర, మునికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వార్షిక ప్రణాళిక తయారీపై అవగాహన

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని తిమ్మభూపాలపురంలో ఉన్న మహిళా సమాఖ్య సభ్యులకు సోమవారం 2025-26 ఆర్థిక సంవత్సరంలో మహిళ సంఘాలు వార్షిక ఋణ, జీవనోపాధుల ప్రణాళిక తయారు చేయడంపై ఏపీఎం మునెయ్య అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి సభ్యురాలు 2025-26 సంవత్సరంలో సీఐఎఫ్, బ్యాంక్‌లోన్, స్త్రీనిధి, ఉన్నతితోపాటు పీఎంఈజీపీ, పీఎంఎఫ్ఎంఈ, పీఎంఎంఎస్‌వై, ఇతర కార్పొరేషన్ ఋణాలు, వ్యక్తిగత ఋణాలు ఏది ఏ నెలలో అవసరం, ఏ కార్యక్రమం చేపట్టనున్నారు, ఏ ఋణాలకు అర్హత ఉంది, ఎంత మొత్తం అవసరం ఉంది, ఎంత మొత్తం అవసరం ఉంది అనేది ప్రతి సభ్యురాలితో చర్చించి ప్రణాళిక తయారు చేయనున్నట్లు తెలిపారు. సభ్యులు తీసుకున్న ఋణాలను సకాలంలో చెల్లించి బ్యాంకులో పరపతిని పెంచుకోవాలని చెప్పారు. గ్రామ సంఘం వారీగా సమావేశం ఏర్పాటు చేసి వారి ప్రణాళికను ఆన్‌లైన్ యాప్‌లో నమోదు చేయించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీసీలు వెంకటరత్నం, వీరజిన్నప్ప పాల్గొన్నారు.



మహిళలకు అవగాహన కల్పిస్తున్న ఏపీఎం మునెయ్య

మట్టి, ఇసుక మాఫియాపై చర్యలేవీ..?

ఏర్పేడు(రేణిగుంట): మండలంలో విచ్చలవిడిగా జరుగుతున్న మట్టి, ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు అధికారులు ఏం చర్యలు తీసుకున్నారని మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కూనాటి రమణయ్య యాదవ్ ప్రశ్నించారు. మండలంలో స్వర్ణముఖి నది వెంబడి ఇసుకను రాత్రింబవళ్లు అక్రమంగా తరలిస్తున్నా, రావిళ్లవారి కండ్రిగ ఎద్దుల చెరువు నుంచి రెండు రోజులుగా జేసీబీ పెట్టి ట్రాక్టర్లతో మట్టిని ప్రైవేటు వెంచర్లకు తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. కూటమి పాలనలో అరాచకాలు ఎక్కువయ్యాయన్నారు.